

నాట్యగురువును మెమొంటోతో సత్కరిస్తున్న డా.సముద్రాల వేణుగోపాలచారి, కోలేటి దామోదర్‌గుప్త, లయన్ రమణారావు

## నాట్యకళలను ప్రోత్సహించాలి

### నీటి పారుదల కార్పొరేషన్ చైర్మన్ డా.సముద్రాల వేణుగోపాలచారి

రవీంద్రభారతి, అక్టోబర్ 7 : ప్రాచీన నాట్యకళలను నాట్యగురువులు ప్రోత్సహించి మన దేశ సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాలని నీటి పారుదల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, పోలీస్‌హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్త అన్నారు. శనివారం రవీంద్రభారతిలోని ప్రధాన కళావేదికపై భారత్ ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి, సకల కళా వైభవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై భారత్ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ లయన్ కేవీ.రమణారావుతో కలిసి జ్యోతి ప్రజ్వళన చేశారు. ఈ కార్యక్రమంలో లలితారావు, కృష్ణవేణి, సంపత్, వినయ్, మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ ప్రిన్సిపల్ అనంతలక్ష్మి, లలితపద్మిణి, మౌనిక, సోని, నరేశ్, దైవజ్ఞశర్మ, తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

### జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

జూబ్లీహిల్స్, అక్టోబర్ 7 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని.. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ర్టాన్ని సాధించడం వల్లనే ప్రపంచ వ్యాప్తంగా బతుకమ్మ పండుగకు గౌరవం దక్కిందని బీఆర్‌ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం యూసుఫ్‌గూడ కోట్లవిజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఎంతో సంబురంగా జరుపుకునే పండుగ బతుకమ్మ అని అన్నారు. ఈ సందర్భంగా వేడుకల్లో పాల్గొన్న సుమారు 4 వేల మంది మహిళలకు బతుకమ్మ కానుకలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

## న్యాయవాదులు రాజ్యాంగాన్ని పరిరక్షించాలి

హిమాయత్‌నగర్, అక్టోబర్ 7 : ప్రజాస్వామ్య వ్యవస్థలో మానవ హక్కులు, మేధావులు, అభ్యుదయ వాదులు, జర్నలిస్టులపై దాడులు చేయడం, అక్రమ కేసులు బనాయించడమంటే భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమేనని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ కమిటీ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. శనివారం హిమాయత్‌నగర్‌లోని ఐఏఎల్ రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం క్రిమినల్ చట్టాల్లో సమగ్ర మార్పులు తీసుకు వచ్చేందుకు కొత్తగా ఆమోదించిన బిల్లులపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలోని న్యాయవాదులు రాజ్యాంగ పరిరక్షణకు కీలక పాత్ర వహించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అడ్వకేట్ బార్ కౌన్సిల్ సభ్యులు దుస్సా జనార్దన్, నాయకులు డి.జయ శ్రీనివాస్, కేవీఎల్ ఉదయ్‌భాస్కర్, శ్రీనివాస్, కె.రాంమూర్తి, బి.శ్రీనివాస్, టి.మురళి, రహీం, విష్ణు, భగత్, రాజారాం, రమేశ్, పరమేశ్, శ్రీనివాస్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

# నేరాల ఛేదనలో తెలంగాణే టాప్

### సైబర్ నేరాల కట్టడికి దేశంలోనే తొలిసారిగా.. లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో కౌన్సిల్ ప్రారంభం

### నిపుణుల సహకారంతో నేరాలను ఛేదిస్తున్నాం

### నేరం జరిగిన వెంటనే ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి

### ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, సీపీ స్టీఫెన్ రవీంద్రతో కలిసి ప్రారంభించిన డీజీపీ అంజనీకుమార్



లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో కౌన్సిల్‌ను ప్రారంభించిన డీజీపీ అంజనీకుమార్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, సీపీ స్టీఫెన్ రవీంద్ర, తదితరులు

సిటీబ్యూరో, అక్టోబర్ 7 (నమస్తే తెలంగాణ): రాష్ర్టాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చడంతో పాటు నేరాలను ఛేదించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే మొదటి వరుసలో ఉన్నదని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ అన్నారు. శనివారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన 'లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో కౌన్సిల్'ను ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ అంజనీకుమార్ మాట్లాడుతూ సైబర్ నేరాలు ఇప్పుడు పోలీసులకు ఒక సవాల్‌గా మారుతున్నాయని తెలిపారు. 2023 చివరి నాటికి దాదాపు 8 ట్రిలియన్ డాలర్లు సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్తుందని, ఇది 2022 యూఎస్‌ఏ జీడీపీలో మూడవ వంతని, ఈ సంవత్సరం దేశంలోని జీడీపీలో 2వ వంతని తెలిపారు. ఇంతటి క్లిష్టమైన సైబర్ నేరాలను వివిధ సంస్థలకు చెందిన నిపుణుల సహకారంతో తెలంగాణ పోలీసులు ఛేదించగలుగుతున్నట్లు పేర్కొన్నారు.

### వారిద్దరూ మెయిన్ పిల్లర్లు

సైబర్ నేరాలను ఛేదించడమే కాకుండా బాధితులు పోగొట్టుకున్న డబ్బులను తిరిగి రికవరీ చేయడంలో సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ బ్రైటింగ్ స్టార్స్ అని తెలిపారు. స్టీఫెన్ రవీంద్ర సైబర్ నేరాలను ఛేదించి, నేరగాళ్ల ఖాతాల్లో నుంచి డబ్బులు రికవరీ చేసి, బాధితులకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుండగా, జయేశ్‌రంజన్ తన ఐటీ రంగంలో అప్‌గ్రేడ్ అవడమే కాకుండా ఎప్పటికప్పుడు పోలీస్ శాఖలో నేరాలను ఛేదించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

### ఎంతటి నిపుణులైనా..

ఆయా రంగాల్లో పనిచేసే నిపుణులు వారు పనిచేస్తున్న రంగాలను చాలా తేలికగా తీసుకుంటారని, కానీ అది ప్రమాదకరమని డీజీపీ అన్నారు. కొన్ని రోజుల కిందట తన తోటి అధికారి సైబర్ నేరగాళ్లకు చిక్కి రూ.5లక్షలు పోగొట్టుకొని, సహాయం చేయమని తన వద్దకు వచ్చారని తెలిపారు.

### ఆ దేశంలో 20వేల బాలింతలు మృతి

ఒక దేశంలో 20వేల మంది బాలింతలు ప్రసవించిన కొన్ని గంటల్లోనే మృత్యువాత పడ్డారని, ఇలా 20 సంవత్సరాల పాటు ఈ దుర్ఘటనలు కొనసాగాయని డీజీపీ చెప్పారు. తీరా 20ఏళ్ల తరువాత దీనిపై క్షుణ్ణంగా విచారిస్తే ప్రసవాలు జరిపిన వైద్యులు రాత్రి సమయాల్లో పోస్టుమార్టం చేయడం, అవే వైద్యపరికరాలతో పగలు సమయంలో ప్రసవాలు చేస్తున్నట్లు తేలిందని, పోస్టుమార్టం చేసిన వైద్య పరికరాల వల్ల ప్రసవాలు చేయడంతో బాలింతలు ఇన్‌ఫెక్షన్‌కు గురై, 20వేల మంది తల్లులు మృత్యువాత పడినట్లు పేర్కొన్నారు. అందుకే ఎంత నిపుణులైనా అప్రమత్తంగా ఉండాల్సిందేనని తెలిపారు.

### సైబర్ నేరగాళ్ల బారిన పడితే 1930కు ఫిర్యాదు చేయాలి



లా ఎన్‌ఫోర్స్‌మెట్ సిసో కౌన్సిల్‌కు సంబంధించిన లోగో యూరోపియన్ ఫుట్‌బాల్ కప్‌లా ఉంది. దేశంలోనే తొలిసారిగా అందుబాటులోకి వచ్చిన లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో కౌన్సిల్ అనేది తెలంగాణలో సైబర్ సెక్యూరిటీకి 'బీకాన్'. ప్రస్తుత రోజుల్లో ప్రతీది డిజిటలైజేషన్ అవుతుంది. డిజిటల్ వినియోగదారులు పెరిగినప్పుడు సైబర్ నేరాలు కూడా పెరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడినప్పుడు వెంటనే 1930 లేదా ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి. సైబర్ నేరాలను అరికట్టడంలో లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సిసో కౌన్సిల్ ఎంతగానో ఉపయోగపడనున్నది.సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలి.

**- జయేశ్‌రంజన్, ఐటీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ.**

### సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి : సీపీ స్టీఫెన్ రవీంద్ర



గడిచిన ఏడాది కాలంలో సైబర్ నేరాలు 300శాతం పెరిగాయని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ స్టీఫెన్ రవీంద్ర తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మన డిజిటల్ స్పేస్, ప్రభుత్వ సంస్థలు, కీలకమైన పరికరాలు, పరిశ్రమలను రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సైబరాబాద్ అదనపు పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, క్రైమ్ డీసీపీ కల్మేశ్వర్, అన్ని జోన్‌ల డీసీపీలు, ఇతర పోలీసు అధికారులు, రమేశ్ కాజా తదితరులు పాల్గొన్నారు.

# ఒకే ఇంట్లో.. ముగ్గురు కానిస్టేబుళ్లు

### తీరిన ఆర్టీసీ డ్రైవర్ 28 ఏండ్ల కష్టం

### ఇద్దరు కొడుకులతో పాటు కోడలికి ప్రభుత్వ ఉద్యోగాలు

### సంతోషంలో మునిగిపోయిన కుటుంబ సభ్యులు

బంజారాహిల్స్, అక్టోబర్ 7 : ఒకే కుటుంబంలో ముగ్గురికి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగం వరించింది. సుమారు 28 ఏళ్లుగా కుటుంబాన్ని పోషించడం కోసం ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేస్తున్న తండ్రి కష్టాన్ని ఎలాగైనా తగ్గించాలనే భావనతో కఠోరమైన సాధన చేసిన ఇద్దరు కొడుకులతో పాటు కోడలు పోలీస్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. తన కుటుంబ సభ్యులకు ముగ్గురికి ఒకేసారి ప్రభుత్వ ఉద్యోగం రావడంతో ఆర్టీసీ డ్రైవర్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి.

ఫిలింనగర్‌లోని భగత్‌సింగ్‌కాలనీలో నివాసముండే కుడుకుంట్ల గోపాల్ 28 ఏళ్ల కిందట మహమూబ్ నగర్ జిల్లా పెబ్బేరు నుంచి బతుకుదెరువుకోసం నగరానికి వచ్చి ఆర్టీసీలో డ్రైవర్‌గా చేరాడు. అతడి భార్య శ్యామల గృహిణి. కాగా గోపాల్ పెద్ద కొడుకు కె.వాసు 2018లో బీటెక్ పూర్తిచేశాడు. అదే సంవత్సరంలో కానిస్టేబుల్ ప్రిలిమినరీ రాత పరీక్షలో అర్హత సాధించినా రన్నింగ్‌లో విఫలమయ్యాడు. దీంతో కుటుంబ పోషణ కోసం చిన్న చిన్న ఉద్యోగాలు చేస్తున్నాడు. గోపాల్ చిన్న కొడుకు కె.వినయ్ ప్రస్తుతం ఉస్మానియా యూనివర్సిటీలో బీఎస్సీ కంప్యూటర్స్ చదువుతున్నాడు. ఇదిలా ఉండగా 2021 అక్టోబర్‌లో వాసుకు వనపర్తి జిల్లా జగత్‌పల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ టీచర్ కుమార్తె భవానీతో వివాహమైంది. అయితే 2022లో తెలంగాణ ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్ కోసం నోటిఫికేషన్ విడుదల చేయడంతో ముగ్గురు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి నుంచి కష్టపడి చదివి.. ప్రిలిమ్స్‌లోఉత్తీర్ణులయ్యారు. దీంతో ఫిజికల్ పరీక్షల కోసం కఠోరంగా శ్రమించారు. యూసుఫ్‌గూడ బెటాలియన్‌కు వెళ్లి రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్ తదితర అంశాల్లో హెడ్ కానిస్టేబుల్ జంగయ్య వద్ద శిక్షణ పొందారు. ఈ క్రమంలో ఇటీవల విడుదలైన కానిస్టేబుల్స్ మెయిన్ పరీక్షల ఫలితాల్లో ముగ్గురికి ఉద్యోగాలు రావడంతో ఆర్టీసీ డ్రైవర్ గోపాల్ ఇంట్లో పండుగ వాతావరణం నెలకొంది.



భగత్‌సింగ్ కాలనీకి చెందిన ఆర్టీసీ డ్రైవర్ గోపాల్, అతడిభార్య శ్యామలతో కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందిన ఇద్దరు కొడుకులు, కోడలు